ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్ పరీక్షలు

వనస్థలిపురం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైన జేఈఈ మెయిన్స్ పరీక్షలు వనస్థలిపురం డివిజన్ గుంటి జంగయ్యనగర్‌కాలనీ(ఎల్బీనగర్)లోని ఇయాన్ డిజిటల్ కేంద్రంలో మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం షిఫ్ట్‌లో మొత్తం 919మంది విద్యార్థులకు గాను 893పరీక్షలకు హాజరు కాగా 23మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారు. అదేవిధంగా మధ్యాహ్నం షిఫ్ట్‌లో మొత్తం 920 మంది విద్యార్థులకు గాను 895 పరీక్షలకు హాజరు కాగ 25మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారు. కాగా మోయినాబాద్‌కు చెందిన కార్తీక్ ఆలస్యంగా రావడంతో పరీక్షా కేంద్రం సిబ్బంది అక్కడ నుంచి పంపించడంతో నిరాశతో వెనుతిరిగి వెళ్లాడు.



పరీక్ష కేంద్రం సమీపంలో విద్యార్థుల కుటుంబీకుల నిరీక్షణ

హయత్‌నగర్ : హయత్‌నగర్ అరుణోదయనగర్ కాలనీలోని ఐయాన్ డిజిటల్ సెంటర్‌లో బుధవారం జేఈఈ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఒక్క నిముషం ఆలస్యం అయిన అనుమతించమని అధికారులు ప్రకటించడంతో విద్యార్థులు ఆయా ప్రాంతాల నుంచి ఉదయం 8గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. హయత్‌నగర్ సెంటర్‌కు ముగ్గురు విద్యార్థులు ఒక్క నిముషం ఆలస్యంగా రావడంతో అధికారులు అనుమతించలేదు. విద్యార్థులు, కుటుంబ సభ్యులు ఎంత వేడుకున్నా అనుమతించలేదు. షాద్‌నగర్ నుంచి అనుషా అనే అమ్మాయి ఒక్క నిముషం ఆలస్యంగా వచ్చింది. తెల్లవారు జాముననే ఇంట్లో నుంచి బయలుదేరినప్పటికీ సమయానికి చేరుకోలేకపోయానని రోదించారు. బస్సు కారణంగానే ఆలస్యం జరిగిందని కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో విద్యార్థులు చేసేది లేక వెనుదిరిగి వెళ్లి పోయారు. ఉదయం సెషన్‌లో 917 మంది విద్యార్థులకు గాను 888 మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాశారు. 29 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారు. రెండవ సెషన్‌లో 920 మందికి గాను 893మంది విద్యార్థులు హాజరైనారు. 27 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారు. పరీక్ష నిర్వాహకులు ఉదయం 8 గంటల నుంచి హాల్‌లోకి అనుమతించారు. సరాసరి 9గంటలకు గేట్లు మూసివేశారు. ఆలస్యంగా వచ్చిన ముగ్గురిని అనుమతించలేదు.

సంతోష్‌నగర్ : జేఈఈ మెయిన్స్ పరీక్షలు బుధవారం కర్మన్‌ఘాట్‌లోని అయాన్ డిజిటల్ జోన్ పరీక్షా కేంద్రంలో ప్రశాంతంగా ముగిసాయి. ఈ పరీక్షా కేంద్రంలో సుమారు 1888 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఉదయం 9గంటలకు పరీక్షలు ప్రారంభమై 12గంటలకు ముగిసాయి. ఉదయం జరిగిన పరీక్షకు 918 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 21మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 897మంది విద్యార్థులు హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 919 విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 18మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 901మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉదయం 8గంటల లోపే విద్యార్థుల తల్లిదండ్రులు పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు. విద్యార్థులకు పరీక్షా కేంద్రంలో అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయడంపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.



సమయం దాటిపోవడంతో పరీక్షా కేంద్రం వద్ద గేటు తీయాలని బతిమలాడుతున్న విద్యార్థి కార్తీక్

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- బడంగ్‌పేట్ మేయర్ పారిజాతారెడ్డి
- రెండో రోజూ కొనసాగిన వార్డు సభలు

సరూర్‌నగర్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రజా పాలన వార్డు సభలు మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్ల పరిధిలోని పలు డివిజన్లలో రెండో రోజైన బుధవారం సైతం కొనసాగాయి. బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ, బడంగ్‌పేట్ గ్రామాలకు చెందిన మొత్తం 16డివిజన్లలో బుధవారం సభలు నిర్వహించగా.. పలు డివిజన్లలోని సభలకు మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమిషనర్ పి.సరస్వతి తదితరులు హాజరయ్యారు. ఆయా సభల్లో మేయర్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని ఆమె స్పష్టం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సూర్లగంటి అర్జున్, పెద్దబావి శోభాఆనంద్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, భీమిడి స్వప్నాజంగారెడ్డి, ఏనుగు రాంరెడ్డి, గౌర రమాదేవిశ్రీనివాస్, నాయకులు గట్టు బాలకృష్ణ, నయనాచారి, పెద్దబావి బాబు, బొల్లపల్లి కుమార్, ఆర్వో వేణుగోపాల్‌రెడ్డి, మేనేజర్ నాగేశ్వర్‌రావు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, వివిధ విభాగాల సిబ్బంది ఆయా సభల్లో పాల్గొన్నారు.



బడంగ్‌పేట్ వార్డు సభలో స్థానికుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న మేయర్ పారిజాతారెడ్డి, డిప్యూటీ మేయర్ శేఖర్

మీర్‌పేట్‌లో..

మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని పలు డివిజన్లలో బుధవారం నిర్వహించిన ప్రజాపాలన వార్డు సభల్లో మేయర్ దుర్గాదీప్‌లాల్, కమిషనర్ ఆర్.జ్ఞానేశ్వర్ పాల్గొని ప్రజల నుంచి రైతుభరోసా, ఇందిరమ్మఇళ్లు, రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించారు. గతంలో దరఖాస్తు చేసుకున్న వారిలో ఎంపికైన వారి పేర్లను వార్డు సభల్లో చదివి వినిపించారు.

నియోజకవర్గంలో 20వేల ఇళ్లు కట్టిస్తాం

- గ్రామసభలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో 20వేల ఇళ్లను కట్టిస్తామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని అనాజ్‌పూర్ గ్రామంలో బుధవారం నిర్వహించిన గ్రామ సభకు మల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని అధికారులకు సూచించారు. పూర్తిగా ఇళ్లు లేని వారికి గ్రామంలోని ప్రభుత్వ స్థలంలో ఇంటి స్థలంతో పాటు రూ. 5 లక్షలతో ఇంటిని కట్టిస్తామని తెలిపారు. ఒకే ఇంట్లో నలుగురు అన్నదమ్ములు ఉంటే వారందరికీ వేరువేరుగా రేషన్ కార్డులను అందించనున్నట్లు స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అని ఎమ్మెల్యే ప్రశ్నించగా కొందరు ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ రావడం లేదని తెలిపారు. 200 యూనిట్ల లోపు వారికి ఉచిత విద్యుత్ రాకపోతే బిల్లులు కట్టవద్దని ఎమ్మెల్యే సూచించారు. మండలంలోని కవాడిపల్లి, గుంతపల్లి, బండరావిరాల, జాఫర్‌గూడ గ్రామాల్లో గ్రామ సభలు జరిగాయి. కార్యక్రమంలో గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీవాణితో పాటు నాయకులు పాల్గొన్నారు.



అనాజ్‌పూర్ గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, పక్కన మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

పెద్దఅంబర్‌పేట్‌లో..

పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో బుధవారం వార్డు సభలు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయా పథకాల లబ్ధిదారుల ఎంపిక జాబితాను అధికారులు సభలో చదివి వినిపించారు. అదేవిధంగా కొత్తగా దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ పండుగుల జయశ్రీరాజు, కమిషనర్ రవీందర్‌రెడ్డి, మేనేజర్ కిరణ్‌కుమార్‌తో పాటు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

హయత్‌నగర్ : ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో భాగంగా చేపట్టిన వార్డు సభలు బుధవారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో నిర్వహించారు. ఇంజాపూర్, కమ్మగూడలో నిర్వహించిన కార్యక్రమానికి పెద్దఎత్తున లబ్ధిదారులు చేరుకున్నారు. రేషన్ కార్డులు రాని వారు కొత్తగా రేషన్‌కార్డు దరఖాస్తులను కమిషనర్ సురేందర్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ హరిత, కౌన్సిలర్లకు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కొశిక ఐలయ్య, సునీల్, కవిత, శ్రీలత పాల్గొన్నారు.

భూదాన్‌లో పేదలకు పట్టాలివ్వాల్సిందే : నర్సింహ

అబ్దుల్లాపూర్‌మెట్ : భూదాన్‌లో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న పేదలకు ప్రభుత్వం పట్టాలివ్వాల్సిందేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఈటీ నర్సింహ డిమాండ్ చేశారు. పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్ ఆర్ఎన్ఆర్‌కాలనీ ఫేజ్-3లో సీపీఐ అబ్దుల్లాపూర్‌మెట్ మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం భూపోరాటం 2వ వార్షికోత్సవ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఈటీ నర్సింహతో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి, రాష్ట్ర సమితి సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి, ప్రజానాట్య మండలి ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈటీ నర్సింహ మాట్లాడుతూ రెండేళ్లుగా ఇక్కడ కనీస వసతులు లేకుండా గుడిసెల్లో నివాసం ఉంటున్నారంటే మీరంత నిజమైన పేదలన్నారు. పేదలు గుడిసెలు వేసుకున్న స్థలం ప్రభుత్వ, భూదాన్ భూమి అయితే అక్కడే పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని గతంలో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినట్లు తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీంద్రచారి, ముత్యాల యాదిరెడ్డి మాట్లాడుతూ ఇళ్ల స్థలాలు సాధించే వరకు వెనక్కుతగ్గే ప్రసక్తి లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సామిడి శేఖర్‌రెడ్డి, సీపీఐ కౌన్సిలర్, జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, మాజీ కౌన్సిలర్ హరిసింగ్‌నాయక్, వేణుగోపాల్‌చారి, మాధవరెడ్డి, నర్సింహ, అరుణ, నవనీత, మధు, యాదగిరి, భానుప్రసాద్, సైదులు, వీరేష్, శ్రీకాంత్, సుజాత, దేవమ్మ పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

- బహుమతి ప్రదానం చేసిన డీజీపీ శివధర్‌రెడ్డి

ఎల్‌బీనగర్ : సరూర్‌నగర్ స్టేడియంలో మూడు రోజులుగా కొనసాగిన రాచకొండ పోలీస్ కమిషనరేట్ 6వ వార్షిక క్రీడలు బుధవారం సాయంత్రం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఇంటెలిజెన్స్ శివధర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. స్పోర్ట్స్‌మీట్‌లో విజేతలకు ఆయన బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. విధి నిర్వహణలో ఎదురయ్యే ఒత్తిళ్లతో పాటు వివిధ రకాల సవాళ్ల నుంచి ఉపశమనం పొంది, నూతన ఉత్తేజంతో తిరిగి విధి నిర్వహణలో పాల్గొనేలా చేయడానికి ప్రతి సంవత్సరం స్పోర్ట్స్ మీట్‌ను నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు. రాచకొండ పోలీసులు శాంతి భద్రతల పరిరక్షణ కోసం అహర్నిషలు కృషి చేస్తున్నారని తెలిపారు. ముగింపు కార్యక్రమంలో రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు, యాదాద్రి డీసీపీ రాజేష్‌చంద్ర, ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్, మాల్కాజిగిరి డీసీపీ పద్మజ, క్రైమ్ డీసీపీ అరవింద్‌బాబు, మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, ఎస్ఓటీ డీసీపీలు రమణారెడ్డి, మురళీధర్, ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్, డీసీపీ అడ్మిన్ ఇందిరా, సైబర్ క్రైమ్ డీసీపీ నాగలక్ష్మి, ఉమెన్‌సేఫ్టీ డీసీపీ ఉషా విశ్వనాథ్, ఐటీ సెల్ ఏసీపీ నరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న డీజీపీ శివధర్‌రెడ్డి

నిషేధిత నల్లబెల్లం, స్పటిక స్వాధీనం

ఎల్‌బీనగర్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): సారా రహిత రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దాలని ఎక్సైజ్ కమిషనర్ కమల హాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు దాడులు నిర్వహించినట్లు రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారి కిషన్ తెలిపారు. పహాడీషరీఫ్‌లోని ఒక గోదాం వద్ద డీసీఎం నుంచి ఆటోలకు అక్రమంగా నిషేధిత నల్లబెల్లం, పటిక బస్తాలను డంపు చేస్తున్నారన్న పక్కా సమాచారంతో ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. బుధవారం సరూర్‌నగర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారి కిషన్ వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి.. కర్ణాటక నుంచి నగర శివార్లలోని పహాడీషరీఫ్‌కి నిషేధిత నల్లబెల్లం, స్పటికను అక్రమంగా తరలించారు. పహాడీషరీఫ్ వద్ద వాటిని ఇతర ప్రాంతాలకు చేరవేసేందుకు ఆటోలలోకి డంప్ చేస్తున్నారు. పక్కా సమాచారం అందడంతో ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేశారు. ఈ దాడుల్లో నలుగురిని అదుపులోకి తీసుకుని నిందితుల వద్ద నుంచి రూ.12.50 లక్షల విలువ చేసే 7,860కిలోల నిషేధిత నల్లబెల్లం, 40 కిలోల స్పటిక, డీసీఎం, రెండు 2ఆటోలు, రూ. 1,07,500ల నగదు, నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

నిందితుల్లో శివకాంత్, కేతావత్ అరుణ్ నాయక్, సభావట్ హీర్యాసింగ్, మహమ్మద్ బాబాలను అరెస్ట్ చేయగా రమావత్ నరేష్, కేతావత్ శ్రీను నాయక్‌లు పరారయ్యారు. స్వాధీనం చేసుకున్న నల్లబెల్లం, స్పటిక, నగదు, మొబైల్ ఫోన్లు, డీసీఎం, ఆటోలతో పాటు నిందితులను సమావేశంలో ఎక్సైజ్ అధికారులు ప్రదర్శించారు.



మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బలాల

కుట్టు మిషన్ల పంపిణీ

చాదర్‌ఘాట్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. బుధవారం ఆజంపుర డివిజన్‌లోని కాలాడేరలో గల ఓవైసీ కమ్యూనిటీహాల్‌లో కుట్టుశిక్షణ పూర్తి చేసుకున్న 50మంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న మహిళలకు ఉచితంగా కుట్టుశిక్షణ నిస్తున్నామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు కుట్టుమిషన్లను ఉచితంగానే అందజేస్తున్నామన్నారు. నిరుపేద కుటుంబాలకు చెందిన మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఆజంపుర డివిజన్‌లోని కాలాడేరకాలనీ, పూల్‌బాగ్, చంచల్‌గూడ ప్రాంతాలకు చెందిన మహిళలు కుట్టుమిషన్లు అందుకున్న వారిలో ఉన్నారు. ఎంఐఎం మలక్‌పేట మహిళా విభాగం ఇన్‌చార్జి నజీమా, డివిజన్ అధ్యక్షుడు షేక్ మోహియుద్దీన్ అబ్రార్, సయ్యద్ అలీ పాల్గొన్నారు.

28 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

వివిధ రకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న నిరుపేద కుటుంబీకులకు అవసరమైన వైద్య సహాయం కోసం మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల లబ్ధిదారులకు పంపిణీ చేశారు. 28 మందికి సుమారు రూ.12,39,500ల విలువ గల చెక్కులను పంపిణీ చేశారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

సరూర్‌నగర్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ 5వ డివిజన్‌లోని వినాయకహిల్స్, రామిడిహిల్స్ కాలనీల్లో చేపట్టనున్న బీటీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు బుధవారం కార్పొరేటర్ బోయపల్లి దీపికాశేఖర్‌రెడ్డితో కలిసి మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి శంకుస్థాపన చేశారు. స్థానిక నాయకులు ఎదుళ్ల ప్రతాప్‌రెడ్డి, అయోధ్యాచారి, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణాయాదవ్, వినోద్‌నాయక్, రంజిత్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, మల్లేశ్‌యాదవ్, వీసీపీరెడ్డి, సోమయ్యయాదవ్ పాల్గొన్నారు.

నాదర్‌గుల్‌లో..

నాదర్‌గుల్ 8వ డివిజన్‌లోని చిలుకూరి కాలనీలో కొత్తగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను బుధవారం కార్పొరేటర్ గూడెపు ఇంద్రసేన ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఏపీఎస్‌ఈబీ కాలనీలో ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న జీహెచ్ఎంసీ జడ్సీ హేమంత్ కేశవ్ పాటిల్, కార్పొరేటర్ సుజాతానాయక్

ఏపీఎస్ఈబీ కాలనీలో పర్యటించిన జడ్సీ

చంపాపేట, జనవరి 22(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని ఏపీఎస్ఈబీ కాలనీలో బుధవారం కార్పొరేటర్ సుజాతానాయక్‌తో కలిసి జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్ పర్యటించారు. వరద నీటితో ముంపునకు గురవుతున్న ప్రాంతాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్సీ మాట్లాడుతూ కాలనీ నుంచి బైరామల్‌గూడ చెరువు వరకు జీహెచ్ఎంసీ నిధులు రూ.12.5కోట్ల వ్యయంతో వరద నీటి కాలువ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. డివిజన్‌లోని వందనపురి కాలనీ, కేకే గార్డెన్, రెడ్డి కాలనీల మీదుగా వరదనీటి కాలువ వెళ్లేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జడ్సీ అధికారులను ఆదేశించారు. రాబోయే వర్షాకాలంలో వరద నీటితో సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ పేర్కొన్నా రు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ సర్కిల్ డీసీ ఇస్లావత్ సేవానాయక్, ఇంజనీరింగ్ అధికారులు వెంకటకిరణ్‌రెడ్డి, కార్తీక్, మల్లికార్జున్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు : లచ్చిరెడ్డి

వనస్థలిపురం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తామని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సాహెబ్‌నగర్ కల్యాణమండపంలో ప్రజా పాలన రైతు భరోసా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, హయత్‌నగర్ ఎమ్మార్వో జానకి, అగ్రికల్చర్ అధికారి సులేమాన్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఈనెల 26నుంచి అమలు చేసే రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు ఇతర సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేస్తామన్నారు. సంక్షేమ పథకాలకు అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శ్వేత, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నర్సింహయాదవ్, రమేష్ పాల్గొన్నారు.

వరదనీటి కాలువ పనులు చేపట్టాలి : నవజీవన్‌రెడ్డి

వనస్థలిపురం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా వరదనీటి కాలువ పనులు చేపట్టాలని కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. బుధవారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కప్పల చెరువు నుంచి హయత్‌నగర్ డివిజన్‌లోని ఆంధ్రకేసరినగర్ మీదుగా శారదానగర్ వరకు నిర్మించనున్న వరదనీటి కాలువ లెవల్స్‌ను వనస్థలిపురం మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, సంబంధిత అధికారులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కార్పొరేటర్ మాట్లాడుతూ వరదనీటి కాలువ పనులు భవిష్యత్ తరాల వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నాణ్యతతో చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో డీఈఈ దామోదర్, రమేష్, కాలనీవాసులు పాల్గొన్నారు.

కేంద్ర బలగాలతో ఫ్లాగ్‌మార్చ్

చాదర్‌ఘాట్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం కేంద్ర బలగాలతో పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. మలక్‌పేట ఏసీపీ శ్యాంసుందర్ పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ నరేష్ తన సిబ్బందితో కలిసి మలక్‌పేట క్వార్టర్స్, మూసారాంబాగ్, గడ్డిఅన్నారం తదితర ప్రాంతాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రజలకు భద్రతపై మరింత భరోసా కల్పించేందుకు కేంద్ర బలగాలతో కలిసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నట్లు ఏసీపీ తెలిపారు.



కేంద్ర బలగాలతో ఫ్లాగ్‌మార్చ్‌లో మలక్‌పేట ఏసీపీ శ్యాంసుందర్, ఇన్‌స్పెక్టర్ నరేష్

రోడ్డు భద్రతపై విద్యార్థుల ర్యాలీ

హయత్‌నగర్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని బుధవారం హయత్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థుల హయత్‌నగర్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ట్రాఫిక్‌రూల్స్ పాటిద్దాం- రోడ్డు ప్రమాదాలను నివారిద్ధాం అంటూ నినాదాలు చేస్తు ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీ పాఠశాల నుంచి విజయవాడ జాతీయ రహదారి గుండా మండల పరిషత్ కార్యాలయం నుంచి తిరిగి పాఠశాల వరకు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి, మండల విద్యాధికారి శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇందిరాతో పాటు ట్రాఫిక్ పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నందిహిల్స్ ఫేజ్-2 అధ్యక్షుడిగా ఆనందం

సరూర్‌నగర్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని నందిహిల్స్ కాలనీ ఫేజ్-2 సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పులిపలుపుల ఆనందం ఏకగ్రీవంగా ఎన్నికవగా మిగతా కార్యవర్గంలో ఉపాధ్యక్షులుగా జి.రమేశ్‌గుప్తా, ఎం.సురేశ్‌గుప్తా, ఎన్.రవీంద్రనాయక్, ఆర్.గణేశ్, కార్యదర్శిగా జె.నర్సింహారెడ్డి, సహాయ కార్యదర్శిగా ఇ.సత్యంగౌడ్, సంయుక్త కార్యదర్శిగా ఎన్.శ్రీనివాసాచారి, కోశాధికారిగా టి.ప్రశాంత్‌రెడ్డి, ఆడిటర్‌గా రాజేశ్వరశర్మ, సభ్యులుగా జగపతి, అశోక్, సరోజినీనాయక్, తిరుపతమ్మ, జగదీశ్‌గౌడ్ ఎన్నికయ్యారు.

బీజేపీ ఐఎస్‌సదన్ అధ్యక్షుడిగా గిరిధర్‌రెడ్డి

సైదాబాద్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): యాఖత్‌పురా నియోజకవర్గం బీజేపీ ఐఎస్‌సదన్ డివిజన్ అధ్యక్షుడిగా రెండోసారి జి. గిరిధర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు భాగ్యనగర్ జిల్లా బీజేపీ ఎన్నికల అధికారి బంగారు శృతి నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు చెప్పారు.

ప్రొఫెషనల్ లీగ్ క్రికెట్ టీ-20 పోటీలు

ఎల్‌బీనగర్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): గ్రీన్‌గైడ్, ఓజోన్ ఆధ్వర్యంలో ప్రొఫెషనల్ లీగ్ క్రికెట్ టీ-20 పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రొఫెషనల్ లీగ్ క్రికెట్ టీ-20 చైర్మన్ డాక్టర్ ఇంద్రసేనారెడ్డి తెలిపారు. బుధవారం ఎల్బీనగర్‌లోని ఓజోన్ ఆస్పత్రి ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో లీగ్ క్రికెట్ ప్రతినిధులతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో వివిధ వృత్తి నిపుణులలో వచ్చే మానసిక ఒత్తిళ్లు, ఆందోళన దూరం చేయడానికి ఈ క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు డాక్టర్లు, లాయర్ల మధ్య మ్యాచ్‌లు నిర్వహించామని ఆయన చెప్పారు. జనవరి 26 వరకు ఆసక్తి గల క్రీడాకారులు తమ జట్ల పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. ఫిబ్రవరి 26 నుంచి లీగ్ మ్యాచ్‌లు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ఓజోన్ ఆస్పత్రి డైరెక్టర్లు, గ్రీన్‌గైడ్ ప్రతినిధులు డాక్టర్లు డీవీరావు, మధుసూదన్‌రెడ్డి, రంజిత్, అతిహ్ పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కళాశాల నిర్లక్ష్యం.. పరీక్షకు దూరమైన విద్యార్థులు

సైదాబాద్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మలక్‌పేటలోని ముంతాజ్ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న పది మంది విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వకపోవడంతో తల్లిదండ్రులతో కలిసి కళాశాల ఎదుట ఆందోళనకు దిగారు. బుధవారం మొదటి సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం కాగా, హాల్‌టికెట్ లేని కారణంగా వారు పరీక్షకు దూరమయ్యారు. ఎలాంటి ఫీజు బకాయి లేదని, దీనిపై ప్రశ్నిస్తే జేఎన్టీయూలో సాంకేతిక సమస్య కారణంగా హాల్‌టికెట్లు ఇవ్వలేకపోయామని.. గురువారం సమస్య పరిష్కారమవుతుందని కళాశాల సిబ్బంది చెబుతున్నారని విద్యార్థులు వాపోయారు. కోల్పోయిన పరీక్షకు ఎవరు బాధ్యత వహిస్తారని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ ఘటనపై జేఎన్టీయూ అధికారులు స్పందించాలని వేడుకుంటున్నారు.

ఇద్దరు పిల్లలను వదిలి వివాహిత అదృశ్యం

హయత్‌నగర్ : ఇద్దరు పిల్లలను వదిలి వివాహిత అదృశ్యమైన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన మదన్‌చౌదరి భార్య మమత చౌదరి(32) ఇద్దరు పిల్లలతో కలిసి తొర్రూర్‌లో నివాసం ఉంటున్నారు. భర్త సోమవారం బంధువుల శుభకార్యం ఉందని బెంగళూరుకు వెళ్లారు. భర్త లేని సమయాన్ని చూసిన మమతాచౌదరి తన ఇద్దరు పిల్లలను ఇంటి వద్ద వదిలి ఎవరికి చెప్పకుండా మంగళవారం బయటకు వెళ్లింది. ఇంత వరకు ఇంటికి రాకపోవడంతో భర్త బంధువుల వద్ద, స్నేహితుల వద్ద విచారించినా ఫలితం లేకపోవడంతో బుధవారం సాయంత్రం తన భార్య కనిపించడం లేదని హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి కిడ్నాప్, దోపిడీ కేసులో నిందితుల అరెస్ట్

- పరారీలో మరో ముగ్గురు

సైదాబాద్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): స్నేహితులతో బైక్‌పై వెళ్తున్న యువకుడిని గుర్తుతెలియని ఆగంతకులు అడ్డగించి కిడ్నాప్ చేసి చీకటి ప్రాంతానికి తీసుకువెళ్లి చితకబాది రూ.1500 నగదు, ఫోన్, వాచ్ దోచుకున్న ఘటనలో ఆరుగురిపై సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేయగా మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ తెలిపారు. నల్గొండ జిల్లా నాంపల్లి మండలం, తుంగపాడు గ్రామానికి చెందిన పుల్కారం నరేష్(23), చింతపల్లి గ్రామానికి చెందిన మణికాంత్, బంధువు మహేష్‌లు సోమవారం సంతోష్‌నగర్ ఫిసల్‌బండలో స్నేహితుడి వివాహానికి హాజరయ్యారు. అనంతరం చిన్ననాటి స్నేహితురాలిని కలిసేందుకు సైదాబాద్ కాలనీకి రాత్రి 8గంటల సమయంలో వచ్చి జ్యూస్ సెంటర్ వద్ద కలిశారు. స్నేహితురాలు వీరితో కొద్దిసేపు మాట్లాడి వెళ్లింది. అనంతరం మహేష్ బైక్ నడుపుతుండగా మణికాంత్, నరేష్‌లు వెనుక కూర్చొని పయనమయ్యారు. కొంతదూరం వెళ్లగానే రెండు బైకులపై వెంబడించిన గుర్తు తెలియని నలుగురు యువకులు వీరిని అడ్డగించి బూతులు తిడుతూ అడ్డగించారు. ఈ క్రమంలో మహేష్, మణికాంత్ బైక్‌పై పారిపోగా నరేష్ వారికి చిక్కాడు. అతడిని పట్టుకున్న ఆగంతకులు వారి బైక్‌పై కూర్చోపెట్టుకుని చీకటి ప్రదేశానికి తీసుకువెళ్లారు. అప్పటికే అక్కడ మరికొందరు యువకులు కూర్చొని ఉన్నారు. వారంతా కలిసి నరేష్‌ను చితకబాది అతడి వద్దనున్న రూ.1500 నగదు, ఫోన్, వాచ్ లాకున్నారు. ఇంకా రూ.5వేలు కావాలని డిమాండ్ చేశారు. తన వద్ద లేవని బతిమాలాడు. నరేష్ ఫోన్ నుంచి మణికాంత్‌కు ఫోన్‌చేసి వదిలివేయాలంటే రూ.5వేలు ఆన్‌లైన్ చేయాలని బెదిరించారు. తాను ఇవ్వలేనని మణికాంత్ చెప్పడంతో నరేష్‌ను హెచ్చరించి విడిచిపెట్టారు. దీంతో బాధిత యువకుడు సైదాబాద్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని జరిగిన ఘటనపై ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితులు శంకేశ్వర్ బజార్‌కు చెందిన మహ్మద్ ఒవైస్(27), లోకాయుక్తా కాలనీకి చెందిన పవన్ సాయి శ్రీనిధి(24), సైదాబాద్‌కు చెందిన మహ్మద్ రాజీ హైదర్(27)లను అరెస్ట్ చేయగా మహేష్, రోహిత్, రియాన్‌లు ఫరారీలో ఉన్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.